# క్యూ

ఎదురు చూస్తున్న గవాక్షం
ఎప్పుడన్నా మూసుకు పోవచ్చు
సగం తెరిచిన నోరు
ఎప్పుడన్నా మూసుకు పోవచ్చు

అంతవరకూ
బారులు తీరిన అవసరాలు
అసహనాన్ని మింగుతూ
చీమల దండులా
కాళ్లకింద కాలాన్ని దొర్లిస్తుంటాయి

అక్కడైనా ఎక్కడైనా
కొండెక్కడానికి కోటి మార్గాలుంటాయి
సత్తానిబట్టి - సత్తువని బట్టి
ముందూ వెనకా

దారిలో
తరిగిపోతున్న అడ్డంకులెన్నో
తరుముకొస్తున్న నీడలెన్నో
అందరికీ అంచనాయే!
వేసే ప్రతి అడుగులో
కనిపించిన కాస్త నీటితో
దాహం తమ వరకే తీరాలన్న తహతహ
ఎంతయినా
మిగిలి పోయిన శూన్యం కారాదన్న ఆరాటమే!

కిటికీకావల యాంత్రికత
దేనినీ గమనించదు
నలిగి నలిగి
ఎలాగో దానిని చేరుకోబోతున్నప్పుడు
ఎవరో ఛళ్లున చరిచినట్టు
మొహం మీదే కిటికీ మూత పడి నప్పుడు
ఒక రోజు
రోజంతా కోల్పోయిన
ఆవేశ గుండంలో విలవిలలాడుతూ కాస్సేపు
వినే నాధుడెవరూ ఉండరు

అయినా
అవసరం అంతటితో ఆగిపోనివ్వదు
ఏదో మార్గాన సాధించి తీరాల్సిందే!
మన వంతు రావల్సిందే!